# గ్రాండ్ కాన్యన్

ప్రపంచంలో ఎన్నో అద్భుతాలు.

అంటే వండర్స్ ఆఫ్ ది వరల్డ్ అన్న మాట. అవి ఏడు అని మనం చిన్నప్పుడు చదివింది నిజంగా నిజం కాదు. అంటే ఏడు నిజమే కానీ, ఆ ఏడూ ఒకే ఏడు కాదు. ఎన్నెన్నో. కొంతమంది ఆ ఏడూ పురాతన జీవనానికి అనుబంధిస్తే కొంత మంది నూతన ప్రపంచానికి అన్వయించారు. ఇలా ఎన్నో లిస్టులున్నాయి. ఎవరి గొప్పలు వాళ్ళు చెప్పుకోటానికి వాళ్ళు తయారు చేసుకున్న "ఏడు"ల లిస్టులవి. (ఎవరి ఏడుపు వాళ్ళది అంటే మర్యాదగా వుండదేమో!) వీటి గురించి ఇంకోసారి చెప్పుకుందాం. కొంతమంది,"మనిషి కట్టినవి లెక్కలోకి రావు, స్వతహాగా ఏర్పడినవి అంటే ప్రకృతి సిద్ధమైనవే ఏడు అద్భుతాల్లో లెఖ్ఖవేయాలి" అన్నారు. ఆ లెఖ్ఖ ప్రకారం చెప్పిన ఏడు అద్భుతాలు కూడా ఒకే ఏడు కాదు. ఏటేటా కొత్తవి వస్తూ వున్నాయి. కానీ ఆ లిస్టులన్నిటిలోనూ ప్రముఖంగా వున్నదీ, గంటల తరబడి చూస్తున్నా తనివి తీరనిదీ, గ్రాండ్ కాన్యన్. దాని గురించే చెప్పుకుందాం ఈసారి.

కాన్యన్ అంటే భూమిలో పెద్ద చీలిక అని. కొంతమంది రెండు కొండల మధ్య లోయ అంటారు కానీ నాకలా అనాలనిపించటంలేదు. లోయని ఇంగ్లీష్‌లో వ్యాలీ అంటాం కదా. హైద్రాబాద్‌లో రోడ్డు మీద ఆటోలో వెడుతున్నప్పుడు బుర్ర రామకీర్తన పాడుతుండే అలాటి గుంటలూ, రోడ్డు మీద తవ్విన గోతులూ గురించి కాదు మనం మాట్లాడుకునేది. ఒక అద్భుతమైనదిది. అందుకే గ్రాండ్ కాన్యన్ అని పేరు వచ్చింది.

ఈ గ్రాండ్ కాన్యన్ అమెరికాలో ఆరిజోనాలో వుంది. దీని పొడుగు 277 మైళ్ళు. ఒక మైలు లోతు. పద్దెనిమిది మైళ్ళ వెడల్పు. వయసు ఐదారు మిలియన్ల సంవత్సరాల పైన అని అంచనా. దీని చుట్టూతా ఎర్రటి రాళ్ళ కొండ. ఆ కొండ వయసు 17 మిలియన్ల సంవత్సరాలని భూగర్భ శాస్త్రజ్ఞులు అంటున్నారు. అక్కడ వున్న కోలరాడో నది ఉధృతంగా పారుతూ అన్ని మిలియన్ల సంవత్సరాల్లో భూమినీ, కొండల్నీ రాళ్ళనీ కోసేసి, ఆ కాన్యన్‌ని అలా తయారు చేసిందని అంటారు.

గ్రాండ్ కాన్యన్‌ని చూడటానికి సంవత్సరానికి ఐదు మిలియన్ల యాత్రీకులు వస్తున్నారు.

మేం ఆస్టిన్‌నించి కారులో బయల్దేరి, న్యూ మెక్సికో రాష్ట్రంలోని కార్ల్స్ బాడ్‌లో భూగర్భ గుహలు చూసుకుని, అక్కడినించీ ఆరిజోనాలోని ఫ్లాగ్‌స్టాఫ్ మీదుగా గ్రాండ్ కాన్యన్‌కి వెళ్ళాం. ఆస్టిన్‌కి అది దాదాపు పదిహేను వందల మైళ్ళ దూరంలో వుంది.

సాయంత్రం ఐదు గంటలనించీ ఎనిమిది గంటల దాకా అందరం పిల్లలతో సహా అలా చూస్తూనుంచున్నాం. ఆ అందం వర్ణించటం నా తరం కాదు. రకరకాల రంగులలో అద్భుతంగా వుంటుంది. సూర్యాస్తమయం చూస్తుంటే ఎరుపూ పసుపూ

రంగుల ఆకాశంలోనించి నెత్తురు రంగు సూర్యుడు, ఎర్రటి కొండరాళ్ళ మధ్యనించీ కింద పారుతున్న నీలం రంగు నీళ్ళల్లోకి ఈదుకుని వెళ్ళిపోతుంటే, ఆ రంగుల కలయికలో ఇంకా కోటిరంగులు. రంగురంగుల రంగులు. చీకటిపడుతున్న కొద్దీ పాకుతున్న ఎన్నో రంగుల పాములా కనపడుతుంది ఆ కాన్యన్. చాలమంది పెయింటర్స్ ఆ అందాల్ని కాన్వాస్‌మీద చిత్రీకరించటం అక్కడ సర్వసాధారణమే. అలాగే పొద్దున్న సూర్యోదయం కూడాను. ప్రొద్దెక్కుతున్న కొద్దీ సూర్యుడి కదలికతో ఆ రంగుల మధ్య గ్రాండ్‌కాన్యన్ నెమ్మదిగా కదులుతున్నట్టు కూడా భావన వస్తుంది.

ఇక్కడికివచ్చే యాత్రికులకి చక్కటి సదుపాయాలతోపాటూ ఎన్నో రకాల సరదాలు. కార్యకలాపాలు. వాటిల్లో ఒకటి రాఫ్టింగ్. నిమిషానికి 15,000 ఘనపుటడుగుల పల్లటి నీరు ప్రవహించే ఆ కోలరాడో నదిలో, రాఫ్టకి (తెడ్డు వేసే ఒక రకమైన బోటుకి) నలుగురు నించీ పదిమంది దాకా, ఎంతో ఉత్సాహంగా, తెడ్డు వేసుకుంటూ "లాహిరి లాహిరి లాహిరిలో..." అని పాడుకుంటూ వెడుతూ ఆనందిస్తారు. 1928లో గ్లెన్ హైడ్, బెట్టీ హైడ్ అనే ధైర్యస్థులైన భార్యా భర్తలు మొట్టమొదటిసారిగా ఆ నది ఎంత దూరంవుందో ఎలావుంటుందో చూద్దామని మూడున్నర వారాల్లో నలభై మైళ్ళ దూరం ఆ రాఫ్ట్‌లో ప్రయాణం చేశారుట. గ్రాండ్ కాన్యన్‌లో వాళ్ళు వెళ్ళిన కాన్యన్ పేరు కాటరాక్ట్ కాన్యన్. వాళ్ళు వెళ్ళారే కానీ మళ్ళీ తిరిగి రాలేదు. ఇప్పుడు ప్రతిరోజూ వేలమంది యాత్రీకులు ఇక్కడ రాఫ్టింగ్ చేస్తుంటారు. విపరీతమైన వేగంతో నీళ్ళు బోటుని తిప్పికొడుతున్నా జాగ్రత్తగా నడుపుతూ ఆనందంతో తేలుతూ మునుగుతూ వెర్రికేకలు వేసుకుంటూ అలా వెడుతుంటే చూసే వాళ్ళకి హుషారుగానూ, కొంచెం బెదురుగానూ కూడా వుంటుంది.

ఇక్కడ హెలికాప్టర్ ట్రిప్పులు కూడా వుంటాయి. కొండల మీదనించీ, కాన్యన్ లోపలికి వెళ్ళి ఆ ప్రాంతం అంతా అరగంటలో చుట్టిరావచ్చు. కొండమీద నించి వెడుతూ, ఒక్కసారిగా కాన్యన్‌లోకి వెడుతున్నప్పుడు మన కాళ్ళ కింద భూమి ఒక్కసారిగా మాయమయిపోయినట్టూ కిందపడిపోతున్నట్టూ అనిపిస్తుంది.

ఇక్కడ మ్యూల్ మీద సవారీ చేస్తూ కూడా, కాన్యన్‌లోకి దిగి అట్టడుగు దాకా వెళ్ళి పైకి వస్తారు. మ్యూల్ అంటే గుర్రానికీ గాడిదకీ కలిసి పుట్టినది. మన వేపు కొన్ని ప్రాంతాల్లో దాన్ని కంచర గాడిద అంటారు. వీటికీ గుర్రానికీ తేడా ఏమిటంటే ఇవి నడుస్తున్నప్పుడు నాలుగు కాళ్ళనీ చూసుకోగలవు. అందుకని జాగ్రత్తగా వెడతాయి. మరి ఎక్కడ కాలు జారినా వైకుంఠ యాత్రా స్పెషలే! మరీ కొన్ని చోట్ల 4000 అడుగుల లోతు లోయల పక్కనే వెడుతుంటాయి. వీటి మీద వెళ్ళటానికి ముందు ఓరియంటేషన్‌కూడా వుంటుంది. రోజుకి 150 డాలర్లకి కంచర గాడిదల సవారీ చేయవచ్చు. ఇక్కడ అత్యంత ప్రమాదకరమైనది కాన్యన్‌లోకి నడిచి వెళ్ళటం. అంటే హైకింగ్. అమెరికన్లు స్వతహాగా సాహసప్రియులు కనుక ఈ అత్యంత ప్రమాదకరమైనదే ఇక్కడ అత్యంత ప్రియమైనది కూడా. ఎవరికి వాళ్ళే కాకుండా, చిన్న చిన్న గుంపులుగా వెడతారు ఈ హైకింగ్‌కి. టోనీ నెస్టర్స్ సర్వైవల్ స్కూల్లో - 75 డాలర్లు తీసుకుని, ఏం చేయాలో ఏం చేయకూడదో, ఎలా వెళ్ళాలో ఎలా వెళ్ళ

కూడదో వివరంగా చెబుతారు. హైకింగ్‌కి వెళ్ళేవారు ముఖ్యంగా చేయవలసింది మాటిమాటికీ సీసాల్లో నీళ్ళు త్రాగేసి, నడక పూర్తయేసరికి మూడు చెరువుల నీళ్ళు తాగేయటం. హైకింగ్‌లో అవస్థలు పడేవారిలో ఎనభై శాతం సమస్యలు నీళ్ళు త్రాగకపోవటం వల్లనేనట. కాన్యన్‌లో కొన్ని చోట్ల నూట పాతిక (ఫారన్‌హీట్) డిగ్రీలకి పైగా వుంటుంది టెంపరేచర్. కాన్యన్‌లో పైకీ క్రిందకీ నలభై డిగ్రీల (మళ్ళీ ఫారన్‌హీట్) తేడా వుంటుందిట.

ఈ సర్వైవల్ స్కూల్లో నేర్పించే వాటిల్లో ముఖ్యమైనవి-ఒకవేళ ఎవరైనా దారి తప్పిపోతే సహాయం తీసుకోవటం ఎలా, సహాయం అందే దాకా నిలద్రొక్కుకోవటం ఎలా అన్నవి. ఉదాహరణకి ఈ హైకింగ్‌కి వెళ్ళే వాళ్ళందరికీ తలా ఒక సిడి ఇస్తారు. పాటలు వినటానికి కాదు. ఒకవేళ తప్పిపోతే ఆ సిడీని అద్దంలా ఉపయోగించి సూర్యకిరణాలని రిఫ్లెక్ట్‌చేయటానికి. అది చూసి సహాయం అందుతుంది. మరి సెల్‌ఫోన్లు వున్నాయి కదండీ మళ్ళీ రాతి యుగానికి వెళ్ళాలా అని కొండపల్లి నించీ కొండయ్యగారికీ, బండ్లమూడినించీ బండయ్యగారికీ అనుమానం వచ్చినట్టుంది. ఆ కొండలూ, లోయలూ, రాళ్ళూ రప్పల్లో సెల్ ఫోన్‌లు పని చేస్తాయన్న గ్యారంటీ లేదు. ఒకవేళ అవి పనిచేయకపోతే అని కీలెంచి మేలెంచిన సర్వైవల్ విధానాల్లో ఇదొకటి. అలాగే నీళ్ళ కోసం వెతుక్కోవటం ఎలా, ఆహారం సంపాదించుకోవటమెలా ఆకులూ బలుసాకులూ పళ్ళూ కందమూలాలే కాకుండా పురుగులు తిని బ్రతకటం ఎలా అని కూడా చెబుతారు. కొన్ని పురుగుల్లో ఫార్మిక్ ఏసిడ్ వుంటుందిట. అది ఆరోగ్యానికి మంచిది అంటారు. పురుగుల ఆరోగ్యానికి కాదు. అవి తినే, తినగలిగే మనుష్యుల ఆరోగ్యానికి. సరేనండీ లైఫ్‌బాయ్‌గారూ వాటిల్ని నిజంగా తింటారా? తినగలరా? మామూలుగా తినరు. కానీ ఇక ఏమీ గత్యంతరం లేనప్పుడు, బ్రతకలేక బలుసాకులు దొరకనప్పుడు, ఇది ఇంకొక సర్వైవల్ సాధనం అన్నమాట. కానీ గత రెండేళ్ళలోనూ ఇలా తప్పిపోయి మరణించిన వారు ఒక్కరు మాత్రమే!

ఈ గ్రాండ్‌కాన్యన్‌లో ఇంకో విశేషంకూడా వుంది. ఇక్కడ దాదాపు 400 రకాల పక్షులు వున్నాయి. వాటిల్లో కొన్ని ప్రపంచంలోఎక్కడా చూడని అరుదైన పక్షులు. కొన్ని జాతుల పక్షులు చరిత్రలోనించే మాయమవటం చూసి, వాటిని పరిరక్షించి అవి ఎక్కువయేటట్టు చేస్తున్నారు. కాలిఫోర్నియా కాండోర్ అన్న పక్షులు 1983లో23 మాత్రమే వున్నాయిట. అలా మిగిలిన చాలకొద్ది పక్షుల్ని జాగ్రత్త చేసి, వృద్ధిచేయగా ఇప్పుడవి రెండు వేలకి పైగా వున్నాయని అంచనా. రేడియో సిగ్నల్ ట్రాకింగ్ ద్వారా రకరకాల పక్షులు ఎక్కడ వున్నాయో, ఏం చేస్తున్నాయో, ఎన్ని వున్నాయో చూస్తుంటారుట.

అంతేకాదు స్థానిక ఎలక్ట్రిసిటీ కంపెనీ వారు, ఈ పక్షులు ఎలక్ట్రిక్ వైర్లల్లో చిక్కుకొని, చనిపోకుండా – ఇన్సులేటెడ్ వైర్లని ఉపయోగించి, వీటి పరిరక్షణలో ఉడత సహాయం చేస్తున్నారు.

* * *